హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కందుకూరు: చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



తుక్కుగూడ: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులను దగా చేసిన కాంగ్రెస్ పార్టీ

- ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు
- బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు
- పార్టీ పిలుపుమేరకు నిరసనలు

మహేశ్వరం/కందుకూరు/తుక్కుగూడ: రైతు సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ, లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతు భరోసా, రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్టీ శ్రేణులు ఆదివారం మండల కేంద్రంలో ధర్నా చేశారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవేందర్, డైరెక్టర్ ఆనంద్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కౌన్సిలర్ రవినాయక్, సుమన్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు.



సర్దార్‌పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

చైర్‌పర్సన్‌కు సన్మానం

తుక్కుగూడ: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బరిగెల హేమలతను ఆదివారం రావిర్యాల గ్రామంలోని సర్దార్‌పటేల్ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ వై.శివకుమార్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కందుకూరు: సీపీఎం కందుకూరు గ్రామశాఖ నూతన కార్యదర్శిగా బుట్టి బాల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలోజిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్, మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాల్‌రాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎర్ర జెండా సాక్షిగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

3న డీఎస్పీ మహాసమ్మేళనం

ఆమనగల్లు: ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనం నవంబర్ 3న హైదరాబాద్ ఆదిబట్ల కేబీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కో కన్వీనర్ రమేశ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మేళనం పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. డీఎస్పీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బలరాం, నాయకులు ప్రవీణ్, యాదగిరి, సురేశ్, వంశీ, మహేశ్ ఉన్నారు.



నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ ఎంఎల్ఆర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా పి.సుకుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.పరమేశ్, శ్రీనివాస్, రాజుగౌడ్, హనుమేశ్, సురేశ్, రమా, నీలిమ, హారికలు ఎన్నికయ్యారు. సమావేశానికి స్థానిక 36వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని సభ్యులు పేర్కొనారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. మున్సిపాలిటీకి చెందిన మాధవి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. దీంతో ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో మంజూరైన రూ.22,500 వేల చెక్కును ఆదివారం కౌన్సిలర్ ఆమెకు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

స్థానిక ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక, సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కులగణన పూర్తి చేసి, ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీ కార్యదర్శిగా శ్రీరాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు చందునాయక్, తావునాయక్, జంగయ్య, రవి, కుమార్, నర్సింహ ఉన్నారు.

సెక్యూరిటీ గార్డు కుటుంబానికి ఆర్థికసాయం

మీర్‌పేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సెక్యూరిటీ గార్డు కుటుంబానికి టీకేఆర్ భారతీయ యోగా సంస్థాన్, టీకేఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే శ్రావణ్‌కుమార్ ఈ నెల 7వ తేదీన లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం మృతుడి భార్య అనురాధ, కుటుంబ సభ్యులకు రూ.44వేల నగదు, క్వింటాల్ బియ్యం అందజేశారు. యోగా శిక్షకులు సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, శ్రీనివాస్, కమలాకర్‌రావు, డాక్టర్ నవాజీ, అర్జున్‌రావు, రమేష్, ఇంద్రకుమార్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మాడ్గుల: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యురాలు మల్ల సైదమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాసభలకు జాతీయ, ప్రాంతీయ నాయకులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.